
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!







# కరెంట్ జోలికొస్తే షాకిస్తాం!



## పీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై రైతుల మండిపాటు

- వ్యవసాయంపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని రైతుల ధ్వజం
- అహంకార పూరిత వ్యాఖ్యలు మానుకోవాలని హితవు
- చిన్న, సన్నకారు రైతులపై భారం మోపే కుట్రలని ఆవేదన
- సీఎం కేసీఆర్ విజన్‌తో విద్యుత్‌రంగం బలోపేతం
- 24/7 నిరంతర కరెంట్‌తో హ్యాపీగా పల్లెలు, పట్టణాలు
- ధరణిలో దందాలకు చెక్
- తహసీల్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్

**ఒకనాడు కరెంట్ కోతలతో** అల్లాడిపోయిన రైతులు ఇప్పుడు హాయిగా బతుకుతున్నారు. 24 గంటల ఉచిత విద్యుత్‌తో దర్జాగా పంటలు పండించుకుంటున్నారు. ప్రశాంతంగా సాగిపోతున్న రైతుల జీవితాల్లో కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు గుబులు రేపుతున్నాయి. మూడు గంటల కరెంట్ చాలని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పాలనలో తాము అనుభవించిన విద్యుత్, భూసమస్యలను తలచుకొని కర్షకులు అల్లాడి పోతున్నారు. 24 గంటల కరెంట్ వృథా అంటున్న హస్తం పార్టీకి ఓటేస్తే మళ్లీ కటిక చీకట్లు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.మరోవైపు, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలన్న రేవంత్ వ్యాఖ్యలపై విద్యుత్ నిపుణులు తూర్పారబడుతున్నారు. ధరణితో దళారులకు చెక్‌పడింది. స్లాట్ బుక్ చేసుకుంటే నేరుగా తహసీల్ కార్యాలయానికి వెళ్లి సాఫీగా భూముల రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటికి వస్తున్నారు. నేడు ఎక్కడ కూడా భూసమస్యలు కనిపించడం లేదు. కరెంట్ కష్టాలను తీర్చిన కేసీఆర్ వెంటే తామంతా నడుస్తామని, రైతుల నేస్తమైన కారు గుర్తుకే ఓటేసి గెలిపిస్తామని అన్నదాతలు చెబుతున్నారు. – సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 26



### 24 గంటల కరెంట్ కావాలి

నాకు మూడు ఎకరాల పొలం ఉంది .తెలంగాణ ప్రభుత్వం పంటలకు ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో రైతులకు మేలు జరుగుతుంది. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న మూడు గంటల కరెంట్‌తో ఒక్క మడి కూడా తడవదు..పంటలు పండించలేం. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు మూడు గంటల కరెంట్ ఇచ్చి 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి, పంటలు ఎండిపోతాయి. రైతులు విద్యుత్ కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వస్తది. కాంగ్రెస్ పాలనలో చాలా మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పాతరోజులు తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ చూస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్‌తో రైతులు పండుగలాగా ఎవుసం చేసుకుంటున్నారు. మా బతుకులు ఇప్పుడిప్పుడే బాగు పడుతున్నాయి. సీఎం కేసీఆర్ సారుకే అండగా ఉంటాం.

*– బోయినిస్వామి, రైతు, గుర్రాలగొంది, నారాయణరావుపేట మండలం*

### ఎవుసం తెల్వనివాళ్లు ఏదైనా చెబుతారు



జగదేవ్‌పూర్, నవంబర్ 26: ఎవుసం అంటే తెల్వనివాళ్లు ఏదైనా చెబుతారు. మూడు గంటల కరెంట్ ఇస్తే మస్తయితది అనే కాంగ్రెస్ నాయకులకు ఏంతెల్వదు. మోతాదుగా పోసే బోరుబావులకు టెన్‌హెచ్‌పీ మోటర్లు నడుస్తయా.. గంత ధర పెట్టి మోటర్లు కొంటామా..టెన్‌హెచ్‌పీ మోటర్లు నడవాలంటే బోర్లలో ఐదారు ఇంచుల నీళ్లు ఉండాలే.. మాదగ్గర గన్ని నీళ్లు ఉన్న బోర్లు లేవు. కాంగ్రెస్ హయాంలో ఐదారు గంటల కరెంట్ ఇస్తే చేతికొచ్చిన పంటలు ఎండిపోయేవి. పెట్టుబడులు మీద పడేవి. కేసీఆర్ వచ్చిన తర్వాత 24 గంటల కరెంట్ వచ్చింది. రైతుల బాధలు తప్పాయి. మళ్లీ మూడు నాలుగు గంటల కరెంట్ ఇచ్చి రైతులను ఆగం చేసేటట్లు ఉన్నరు. తప్పుడు మాటలు చెప్పే నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి. బీఆర్ఎస్ పార్టీకి రైతులు మద్దతు తెలిపాలి.

*– బండారి మల్లేశం, రైతు, జగదేవ్‌పూర్ మండలం*

### కాంగ్రెస్ హయాంలో కరెంట్ రాక అరిగోసపడ్డాం



కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోసం అరిగోస పడ్డాం. అర్ధరాత్రి అపరాత్రి కరెంట్ వచ్చి పోతుండే. తెల్లందాకా కరెంట్ పెట్టేందుకు బయిలకాడనే పండుకున్నాం. చీకట్లో పాములు, తేళ్లకు ఎంతో మంది రైతులు చనిపోయారు. కరెంట్ తీగలు చూడక తాకి మస్తుమంది రైతులు ప్రాణాలిడ్చిండ్రు. మేము అనుభవించిన కరెంట్ కష్టాలు పగోనికి కూడా రావొద్దు. ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తుంది. పంటలు కూడా మస్తు పండుతున్నాయి.

*– నూనె ఓజయ్య, రైతు, దుద్దెడ, కొండపాక మండలం*

### రేవంత్‌రెడ్డి మాటలు అబద్ధం



సిద్దిపేటరూరల్, నవంబర్ 26: నాకు రెండు ఎకరాల పొలం ఉంది. ఐదు హెచ్‌పీ మోటర్‌తో నడుపుతున్నా. కరెంట్ పోతలేదు. 24 గంటల కరెంట్ ఉంటేనే పొలానికి నీళ్లు పారుతాయి. కాంగ్రెస్ హయాంలో మోటర్లు, స్టాటర్లు కాలిపోతుండే. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 15 రోజులు పట్టేది. ట్రాక్టర్ల ద్వారా తీసుకుపోయి మరమ్మతులు చేయించుకొని వచ్చే వరకు పంట సగం ఎండిపోయేది. మంచిగ చేసినందుకు రైతులంతా కలిసి పైసలు ఇయ్యాల్సి వచ్చేది. కాంగ్రెస్ హయాంలో ఏం మంచిగున్నది. పొలాలు ఎండిపోవుడు.. రైతులు సచ్చిపోవుడు.. గతంలో రైతులు పంటలు నష్టపోయి సచ్చిపోతే ఆపద్బంధు కింద రూ.50 వేలు ఇచ్చేటోళ్లు.. కేసీఆర్ వచ్చిన తర్వాత రైతు బీమా చేసి మా బతుకులు ఆగం కాకుండా చూసిండు. ఏదైనా అనుకోని ప్రమాదంలో రైతు సచ్చిపోతే దినాలు ఎల్లకముందే రూ.5 లక్షలు వస్తున్నాయి. రైతు గురించి ఇంతగా ఆలోచించిన నాయకుడు దేశంలోనే లేడు. కాంగ్రెసోళ్ల నోరుకు మొక్కాలే.. మంచి చేసిన కేసీఆర్‌ను పొద్దుగాళ్ల లేత్తె తిడుతుడ్రు. కాంగ్రెసోళ్లది ఎట్లుదంటే అధికారంలోకి రాక ముందే తన్నుకుంటురు. ప్రజలను మర్చిపోతరు. తెలంగాణను ఆగం చేసిందే కాంగ్రెస్. అప్పుడు ఉద్యమ సమయంలో పోరగాళ్లు సచ్చిపోయిద్రు. నాన్చినాన్చి తెలంగాణ ఇత్తమన్నరు. రేపు, మాపు అంటూ ఐదేండ్లు కాలం ఎల్లదీసిద్రు. 30 ఏండ్ల నుంచి ప్రభుత్వాలను చూస్తున్నా. గిప్పుడున్న కేసీఆర్ గవర్నమెంట్ మంచిగున్నది. కాంగ్రెస్‌కు ఓటేస్తే మన చావు మనం కొనితెచ్చుకున్నట్లే. కరెంట్, సాగునీళ్లు రాకుంటే పొలాలు గిట్ల పచ్చగ ఉండేవా.. వడ్లు మస్తుగా పండుతున్నాయి.

*–గొడుగు(తెలంగాణ) కనకయ్య, రైతు, పుల్లూరు, సిద్దిపేట రూరల్*



### రైతులపై అధిక భారం

10హెచ్‌పీ విద్యుత్ మోటర్ల వల్ల రైతులకు ఎలాంటి మేలు జరగదు. 10హెచ్‌పీ మోటర్ కొనుగోలు చేయాలంటే పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చుచేయాలి. అందుకు కావాల్సిన కేబుల వైరు ధర కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ మోటరు కాలిపోతే దాని మరమ్మతుకయ్యే ఖర్చు కూడా పెద్ద మొత్తంలో ఉంటుంది. 10 హెచ్‌పీ మోటర్‌తో చిన్న, సన్న కారు రైతులకు ఎలాంటి లాభం లేదు. ప్రాజెక్టుల ద్వారా నీటిని తీసుకొని 10 నుంచి 20 ఎకరాల వ్యవసాయం చేసుకునే రైతులకు మాత్రమే 10 హెచ్‌పీ మోటరు ఉపయోగపడుతుంది. ఇప్పటికే వ్యవసాయం చేస్తూ కుదుటపడుతున్న రైతులకు కొత్త సమస్యలు మొదలవుతాయి.

*– మిద్దె చంద్రమౌళి, కరెంట్ మోటర్ల మెకానిక్, దుద్దెడ, కొండపాక మండలం*

### ఆగం చేసుడే కాంగ్రెస్ పని



సిద్దిపేటరూరల్, నవంబర్ 26: కాంగ్రెస్ నాయకులు ఏదిపడితే అది మాట్లాడుతుడ్రు. రైతులను, ప్రజలను ఆగం చేసుడే వాళ్ల పని. మూడు గంటల కరెంట్ చాలు అంటుడ్రు. వాళ్లు ఎవుసం చేస్తే తెలుస్తది. పొద్దుగాళ్ల పోయి పొద్దుగుకే దాకా ఉంటేనే పొలం పారుతుంది. ఒక్కో మడి తడిసినంక ఇంకో మడికి నీళ్లు పెట్టాలే.. నీళ్లు ఎక్కువ అయితే పంట దెబ్బతింటది. రాత్రిపూట కరెంట్‌తో పరేషాన్. టార్చిలైట్ తీసుకొని సైకిల్ మీద బాయికాడికి పోతే మళ్లీ వచ్చేదాకా నమ్మకం లేకుండే. గిప్పుడు పొద్దుగాళ్ల పోతే పొద్దుగుకినంక ఇంటికి వస్తున్నాం. కరెంట్ పోవుడే లేదు. పచ్చని పొలాలను చూసి కాంగ్రెసోళ్లకు మనసున పడ్త లేదు. రైతుల మీదపడి ఎడుస్తుడ్రు. రైతుల బతుకులతో చెలగాటం ఆడుతుడ్రు. 3 గంటల కరెంట్ సరిపోదు. 24 గంటల కరెంట్ ఉండాల్సిందే. అది కేసీఆర్ వల్లనే సాధ్యం. రేవంత్‌రెడ్డి మాటలు పట్టుకుంటే కరెంట్ షాక్ తగిలి సచ్చుడే.

*– చెత్రి రాజయ్య, రైతు, రాంపూర్, సిద్దిపేట రూరల్ మండలం*

### మళ్లీ బాయికాడనే పండుకోవాలే




మూడు గంటల కరెంట్ ఇస్తే ఇక ఎవుసం బంద్ చేసుకోవాల్సిందే. ఆ మూడు గంటల కరెంట్ ఎప్పుడొస్తదో, ఎప్పుడు పోతదో తెల్వక మళ్లీ ఎనకటి లెక్కనే బాయికాడనే పండుకోవాలే. గిప్పుడు గింత మంచిగ 24 గంటల కరెంట్ ఇస్తుంటే దీనిని చెడగొట్టడానికి కాంగ్రెసోళ్లు చూస్తున్నారు. 10హెచ్‌పీ మోటర్లు మన బోరు, బావులకు పనిచేయవు. ఆమోటర్ కాలిపోతే పండించించిన పంట మొత్తం ఖర్చు చేసినా బాగు కాదు. ఇప్పుడిచ్చినట్లే 24 గంటల కరెంట్ సరఫరా చేయాలి. కాంగ్రెస్ పార్టీ మల్లగిట్ల వస్తే ఎనకటి రోజులే వస్తాయి. సీఎం కేసీఆర్ సారుకే ఎవుసం గురించి ఎరుక. ఆయన మళ్లీ వస్తేనే రైతులకు లాభం జరుగుతది, లేకపోతే నష్టపోతారు. *– చింతల కనకయ్య, రైతు, వల్లంపట్ల, మద్దూరు మండలం*

### మూడు గంటలు వద్దు.. కాంగ్రెస్ వద్దు..



కాంగ్రెస్ హయాంలో చాలా బాధలు పడ్డాం. ఇప్పుడు కాంగ్రెస్ వద్దు.. ఆ మూడు గంటల కరెంట్ వద్దు. కేసీఆర్ హయాంలోనే 24 గంటల కరెంట్ వస్తుంది. ఇంత మంచిగ పెట్టుబడి ఇచ్చి, కరెంట్ ఇస్తుంటే ఇంకా మాకు కాంగ్రెస్ ఎందుకు.అన్ని సౌలత్‌లు ఉన్నాయి కాబట్టే రైతులందరూ సంతోషంగా ఉన్నారు. రైతులు మంచిగ బతుకుతుంటే కాంగ్రెస్ నాయకులు ఓర్వడం లేదు. అందుకే మూడు గంటలు కరెంట్, కౌలు రైతులు అంటుడ్రు.కాంగ్రెస్ వాళ్లకు ఓటేస్తే రైతులకు మళ్లీ తిప్పలు తప్పవు. *– గడ్డం మాధవరెడ్డి, రైతు, అక్కెనపల్లి, నంగునూరు మండలం*

### అప్పటి కరెంట్ కష్టాలు మళ్లీ వద్దు



అప్పటి కరెంట్ కష్టాలు తలుచుకుంటేనే భయమేస్తుంది. రాత్రిపూట బాయిలకాడ పండుకునేటోళ్లం. కరెంట్ ఎప్పుడు వస్తుందో... ఎప్పుడు పోతుందో తెల్వని పరిస్థితి. రాత్రిపూట ఇచ్చే కరెంట్‌తో గ్రామాల్లో చాలామంది పొలాలకు నీళ్లు పెట్టబోయి కరెంట్ షాక్, పాము కాటుకు గురై చనిపోయారు. పొలాలు సరిగ్గా పారకపోయేవి. ఇప్పుడు తెలంగాణలో 24 గంటల కరెంట్ వస్తుండటంతో పుష్కలంగా నీళ్లు పారిస్తున్నాం. ఎవుసం సక్కగా నడుస్తుంది. రైతులు రెండు పంటలు పండించుకుంటూ రాజులుగా బతుకుతున్నారు. పుట్లకొద్ది వడ్లను పండిస్తున్నారు. మళ్లీ కాంగ్రెస్ వస్తే బయిలకాడ పడుకోవాల్సిందే. ఆ బాధలు మళ్లీరావొద్దు. ఆ మూడు గంటల కరెంట్ వద్దు. టెన్ హెచ్‌పీ మోటర్లు వద్దు.

*– సారంపల్లి నర్సయ్య, రైతు, దుబ్బాక*




అవినీతి అరాచకాలకు కేరాఫ్‌గా మార్చినోళ్లకా?

**నీ ఓటు ఎవరికి?**

**తెలంగాణమా తేల్చుకో**

### ధరణితో రైతులకు మేలు



ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ధరణి వల్ల భూములకు పట్టా పుస్తకాలు వచ్చాయి. పేరు మార్పిడి కోసం తహసీల్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి తప్పింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తాం అంటుడ్రు. మళ్లీ గతంలో లాలా కష్టాలు మొదలవుతాయి. రైతుల మీద అంత ప్రేమ ఉంటే 60 ఏండ్లు వాళ్లే కదా పరిపాలించిండ్రు. వాళ్ల పరిపాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉండేదో అందరికీ తెలుసు. లంచాలు ఇవ్వనిదే పని జరిగేది కాదు. అటెండర్ నుంచి పెద్ద అధికారుల వరకు చేయి తడపాల్సిందే. రైతుల కష్టాలను చూసి ధరణి తీసుకువచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వమే మాకు కావాలి.

*– పటేండ్ల సతీశ్ ,రైతు, గుర్రాలతొంది, నారాయణరావుపేట మండలం*

### మళ్లీ దళారుల రాజ్యమే..



కాంగ్రెస్ ధరణిని తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యం వస్తది. రైతులు ఆగమైతారు. ధరణి వచ్చిన తర్వాతే భూములు భద్రంగా ఉన్నాయి. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థ వల్ల రైతులు అనేక కష్టాలు పడ్డారు. వారికి తెలియకుండానే రికార్డుల్లో పేరు మార్పిడి చేసేవారు. దీంతో రైతు తన పేరు తిరిగి మార్పు చేసుకోవడానికి ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పనికాకపోయ్యేది. మళ్లీ పాత విధానం తీసుకువస్తే రైతుల మధ్య గొడవలు జరగడంతో పాటు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తది. ధరణి వచ్చినంకనే రైతులకు మేలు జరిగింది. కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల ఏమాత్రం ప్రేమ లేదు. అందుకే ఇలాంటి చిల్లర ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులందరూ సీఎం కేసీఆర్‌కే అండగా ఉంటారు.

*–మహ్మద్ కోడూరు సిద్దిఖీ జిలానీ, రైతు, మద్దూరు*

### ధరణిని తీసేస్తే రైతులకు కష్టాలు



వర్గల్, నవంబర్ 26:కాంగ్రెసోళ్లు వస్తే ధరణిని తీసేస్తరటా! అని ప్రచా రం జరుగుతుంది. ధరణిని తీసేస్తే మళ్లీ పాత రోజులొస్తాయి. పాస్ పుస్తకాల్లో తప్పులు దొర్లుతాయి. ఒకరి భూములు మరొకరి పేరుమీద మారుతాయి. ఇవి సరిచేయాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. ఓ సారుంటే మరో సారుండరూ. చెప్పులరిగే దాకా తిరగాల్సి వస్తది. మళ్లీ ఎనకటి రోజులు వస్తాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్ప ఆలోచనజేసి ధరణిని తీసుకొచ్చి మా లాంటి చిన్నకారు రైతులకు మేలుచేసింది.ధరణి వచ్చిన తర్వాత కార్యాలయాలకు పోవుడే బంద్ చేశాం. మళ్లీ కాంగ్రెస్ ధరణిని బంద్ చేస్తే మా బతుకులు ఆగమవుతాయి. కల్లబొల్లి మాటలు చెప్పే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కష్టాలు తప్పవు.

*–చెల్లి కనుకరాజు, యువ రైతు, జెబ్బాపూర్, వర్గల్ మండలం*



### గతంలో 15 రోజులు తిరిగినా పట్టా కాలేదు

ధరణి వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. సీఎం కేసీఆర్ సారు రాకముందు రైతులు భూమి కొన్నా అమ్మినా రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగేది. అయినప్పటికీ పట్టా కాకపోయేది, పాస్ పుస్తకం రాకపోయేది. ఇప్పుడు అట్లాపోతే ఇట్లా పట్టా వుతున్నది.ధరణిని తీసేస్తం అంటే మోసం చేసే మాట అన్నట్టే. రైతులకు మంచి చేసేటోళ్లను మర్చిపోరు. నాకు 16 ఎకరాల భూమి ఉన్నది. ఒకప్పుడు నీళ్ల కోసం 18 బోర్లు వేశా. అందులో రెండు కొద్దిగా పడ్డాయి. ఇప్పుడు నీళ్లు రావడంతో మొత్తం ఏవుసం చేసుకుంటున్నా. ధరణితో రైతులకు చాలా మేలు జరుగుతున్నది? *– పొన్న ఐలయ్య, రైతు, కడవేర్గు, చేర్యాల*

### మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరగాలే..



సీఎం కేసీఆర్ సారు తెచ్చిన ధరణితో రైతులకు సమస్యలు లేకుండా పోయాయి. కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తుడ్రు. కానీ ఒకసారి ధరణిలో ఎక్కిన తర్వాత రైతు తన భూమిని బ్యాంకులో భద్రంగాఉంచుకున్నట్లే. ఎందుకంటే బ్యాంకులో ఆ మనిషి లేకుంటే పైసలు ఎట్లాయితే ఇవ్వరో గిడ కూడా ఆరైతు వేలుముద్ర పెడితేనే మరో వ్యక్తి పేరు మీదికి బదిలి అవుతుంది. రైతులు ఆఫీసుల చుట్టూ తిరగకుండానే రికార్డులో ఎక్కుతుంది. గిప్పుడు పైరవీ కారులతో పనిలేకుండా పోయింది. కాంగ్రెసోళ్లు ధరణి తీసివేస్తమంటున్నారు. కాంగ్రెసోళ్లు కానుక వస్తే మళ్లీ మనం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే..

*– దువ్వాల కనకయ్య, రైతు, రాంసాగర్, కొమురవెల్లి మండలం*

### ధరణిని తీసేస్తే మళ్లీ కష్టాలే



గత ప్రభుత్వ పాలనలో బాధలు అన్నీ ఇన్నీ కావు. పహాణీల్లో తప్పులు ,పేరు మార్పిడి కోసం మండల కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరిగేది. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో భూ సమస్యలు లేకుండా పోయాయి.ధరణి పోర్టల్ ద్వారా అరగంటలోనే భూముల రిజిస్ట్రేషన్ జరుగుతున్నది. 15 రోజుల్లో ఇంటికే పాస్‌బుక్ వస్తుంది. ఒక రూపాయి కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదు ధరణి వచ్చిన తర్వాత భూములకు భద్రత వచ్చింది.కాంగ్రెస్ నాయకులు ధరణిని రద్దు చేస్తాంమంటుడ్రు ధరణిని రద్దు చేస్తే భూసమస్యలు మళ్లీ పెరుగుతాయి. మళ్లీ రైతులకు పాత రోజులే వస్తాయి.

*– కనకయ్య ,రైతు, గుర్రాలగొంది, నారాయణరావుపేట మండలం*